క్లుప్తంగా

వైభవంగా శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠ



కొత్తూరులో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: పటవల శివారు కొత్తూరులో పునర్నిర్మించిన ఆలయంలో శ్రీకృష్ణ పరమాత్ముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. త్రిదండి శ్రీరంగ రామానుజ జీయర్ స్వామి ఆశీస్సులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10.54 గంటలకు వినాయక, అయ్యప్పస్వామి వార్ల విగ్రహాలు, శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసారు. అనంతరం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు తణుకు వరలక్ష్మి, శ్రీకృష్ణ ఆలయ కమిటీ ప్రతినిధులు పెద్దిరెడ్డి చంద్రరావు, దేగల జేమ్స్ బాబు, తణుకు సత్తిబాబు, తణుకు లక్ష్మీ వెంకన్న, యాళ్ల సూర్యభాస్కరరావు, తణుకు సత్యనారాయణ పాల్గొన్నారు.

తామరు చెరువు గట్టు అభివృద్ధి హర్షణీయం



మున్సిపల్ కౌన్సిలర్ ఆశెట్టి దంపతులను సత్కరిస్తున్న ఫాదర్ జెస్సీ తదితరులు

అమలాపురం టౌన్: పట్టణంలోని రెండో వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ, మాజీ కౌన్సిలర్ ఆదిబాబు దంపతులను స్థానిక తామరు చెరువు గట్టుపై గల బైబుల్ మిషన్ చర్చిలో ఫాదర్ దొమ్మేటి జెస్సీ ఆదివారం ఘనంగా సత్కరించారు. దుర్గంధభరితంగా ఉండే తామరు చెరువును దశాబ్దాలుగా కౌన్సిలర్ ఆశెట్టి దంపతులు ఆధునీకరించి నేడు గట్టు ప్రాంతాన్ని ఓ ఉద్యానవనంగా అభివృద్ధి చేశారని ఫాదర్ జెస్సీ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

అమలాపురం రూరల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని డాక్టర్ వీవీఎస్ఎస్ మూర్తి అన్నారు. అమలాపురం మండలం ఇందుపల్లి శివారు భట్లపాలెం స్కూల్ వద్ద రోహిణి తల్లీపిల్లలు హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు, ఈ శిబిరంలో వంద మంది విద్యార్థులు, చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చొల్లంగి శివాలినీ అప్పాజీ డాక్టర్ మూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంటీసీ కె.రాంబాబు,ఉప సర్పంచ్ ఉద్రింకి వీరవెంకట సత్యనారాయణ, హెచ్ఎం నాగేంద్ర గౌడ్, వార్డు మెంబర్, బొంతు శ్రీను, బొంతు ప్రసాద్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

అల్లవరం: భావి భారత పౌరులను ఉత్తమంగా తీర్చిదిద్దడంలో, ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమని అల్లవరం ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ బసవా వరహాలు అన్నారు. అల్లవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేస్తున్న ఉపాధ్యాయుడు అచంట వెంకటేశ్వరరావు సన్మాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వెంకటేశ్వరరావు సేవలను కొనియాడారు. అనంతరం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బండిగుప్తాపు పాండురంగ, ఎంపీటీసీ మౌనిక, ఉప సర్పంచ్ దాసం రత్నశ్రీ, బొక్కా ప్రసాదు, ఉపాధ్యాయ సంఘాలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఉప్పలగుప్తం: ఎస్.యానాంలో ఇటీవల మరణించిన లంకే పోతురాజు కుటుంబ సభ్యులను ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ ఆదివారం పరామర్శించి తన సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పోతురాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ లంకే భీమరాజు, లంకే శ్రీను తదితరులు ఆయన వెంట ఉన్నారు.

స్వచ్ఛతపై చిత్తశుద్ధి కరువు

- చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన డ్రైయిన్లు
- ప్రధాన కూడళ్లలోనే స్వచ్ఛతా కార్యక్రమాలు, ప్రతిజ్ఞలు
- అమలాపురంలో గతి తప్పిన పారిశుధ్యం
- అధికారుల పర్యవేక్షణ లోపం
- డ్రైయిన్లు పూడుకుపోయి దుర్గంధభరితం



అమలాపురం మున్సిపల్ కార్యాలయం సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోయిన మేజర్ డ్రైయిన్

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలలో మూడో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర అంటూ ప్రభుత్వ కార్యాలయాల్లో శ్రమదానం, ప్రధాన కూడళ్లలో స్వచ్ఛతా కార్యక్రమాలు, స్వచ్ఛతా ప్రతిజ్ఞలు చేస్తున్నా అమలాపురం మున్సిపాలిటీలో పరిశుభ్రత, స్వచ్ఛతా కానరావడం లేదు. డ్రెయిన్లు (మురుగు నీటి కాలువలు) పూడుకుపోయి చెత్త కుండీలను తలపిస్తున్నాయి. డ్రెయిన్లలో చెత్త, పూడికలు పేరుకుపోవడంతో మురుగు నీరు ఎటూ కదలక దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఈ సమస్యపై ప్రతి వార్డు కౌన్సిలర్ ఆందోళన చెందాతున్నారంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అంచనా వేయవచ్చు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లందరూ మూకుమ్మడిగా పారిశుధ్య విభాగంపై విరుచుకుపడిన తీరే పట్టణంలో పారిశుధ్యం గతి తప్పుతోందన్న ఆరోపణలకు, ప్రజల అభిప్రాయాలకు అద్దం పడుతున్నాయి.

135 కిలోమీటర్ల మేర విస్తరించిన డ్రెయిన్లు

పట్టణంలో అన్ని రకాల డ్రెయిన్లు కలిపి దాదాపు 135 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. ఇందులో మేజర్ డ్రెయిన్లు అంటే మెయిన్ అవుట్ లెట్ల పరిస్థితే అధ్వానంగా ఉంటే ఇంక మైనర్ డ్రెయిన్ల నిర్వహణ ఏ రకంగా ఉంటుందో అంచనా వేయవచ్చు. పారిశుధ్యం అంటే ఉదయాన్నే రోడ్లను, వీధులను పరిశుభ్రం చేసి ఇళ్ల నుంచి చెత్తను సేకరించడమే అనుకుంటున్నారు సంబంధిత అధికారులు. డ్రెయిన్ల నిర్వహణ సక్రమంగా ఉంటేనే పరిసర ప్రాంతాలు, అక్కడ ఉండే నివాసితులు గాలి, నీరు కలుషితం కాకుండా స్వచ్ఛతతో కూడిన పరిసరాల్లో ఆరోగ్యంగా జీవించగలరన్న వాస్తవాన్ని పారిశుధ్య సిబ్బంది గ్రహించడం లేదు. 29వ వార్డు కౌన్సిలర్ తన వార్డులో గత ఎనిమిది నెలల్లో కేవలం నాలుగు సార్లే డ్రెయిన్లను పరిశుభ్రం చేశారని, తర్వాత పారిశుధ్య సిబ్బంది కనిపించలేదని కౌన్సిల్ సమావేశంలో ఆరోపించారంటే డ్రెయిన్ల నిర్వహణ ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మున్సిపాలిటీ పారిశుధ్య విభాగంలో 150 మంది కార్మికులు

మున్సిపాలిటీ పారిశుధ్య విభాగంలో రెగ్యులర్, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో దాదాపు 150 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరంతా రోజూ విధులు నిర్వహిస్తున్నట్లు హాజరు పట్టీల్లో రికార్డులు చూపిస్తున్నా హాజరు నమోదైన తర్వాత కొందరు వెళ్లిపోతున్నారని ఇదంతా పారిశుధ్య అధికారుల పర్యవేక్షణ లోపమేనని కౌన్సిల్ సమావేశంలో పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఒకే మాటగా ధ్వజమెత్తారంటే ఇందులో ఎంత వాస్తవం ఉందో ఆ విభాగాన్ని చూసే అధికారులు ఓసారి ఆత్మావలోకనం చేసుకోవాలి. కేవలం పారిశుధ్యంపై కౌన్సిల్ సమావేశంలో దాదాపు గంట సమయం పాటు కౌన్సిలర్లు వాడీవేడిగా చర్చించారంటే ఈ విభాగం ఎంత బాధ్యతారాహిత్యంతో పనిచేస్తుందో అంచనా వేయవచ్చు.

నిరంతరం పర్యవేక్షణ కరువు

రోజుకు మున్సిపాలిటీ చెత్తను తోడ్కొని వెళ్లే ట్రాక్టర్లు, టిప్పర్లు దాదాపు 35 టన్నుల చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాయి. ఉదయం 5 నుంచి 8 గంటల వరకూ పారిశుధ్య పనులు కొనసాగినా ఉదయం 10 గంటలకు కొన్ని ప్రధాన కూడళ్లలో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. కౌన్సిలర్లు సమావేశంలో పారిశుధ్యం విభాగం వైఫల్యాలపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నప్పుడు పారిశుధ్యాన్ని పర్యవేక్షించే ఏఈ వెంకటేష్ సంతృప్తికరంగా, సమర్థవంతంగా సమాధానాలు ఇవ్వలేకపోయారు. డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు పడేస్తున్న ప్రజలకు అధికారులు అవగాహ కల్పించాలని, డ్రెయిన్ల శుభ్రతను ఎప్పటికప్పుడు పారిశుధ్య విభాగం అధికారులు పర్యవేక్షించాలని పలువురు సూచిస్తున్నారు. రోజుల తరబడి డ్రెయిన్లను పరిశుభ్రం చేయకపోవడం వల్ల డ్రెయిన్లలోకి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారం చేరి పూడికలు పేరుకుపోతున్నాయి.

పారిశుధ్య కార్మికులకు పని ప్రాంతాలను మార్చుతాం

> కౌన్సిలర్లు ఆరోపించినట్లుగా మస్తర్ల లొసుగులకు ఇక నుంచి ఆస్కారం లేకుండా ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు, పర్యవేక్షణా సిబ్బందిని వేరే ప్రాంతాల్లో విధులు నిర్వర్తించేలా మార్పు చేస్తాం. ఇలా 30 వార్డుల్లో ఈ మార్పునకు చర్యలు చేపడుతున్నాం. డ్రెయిన్ల నిర్వహణ, పూడిక తీత పనులు నిరంతరం చేపట్టేలా చర్యలు తీసుకున్నాం.
>
> – కేవీఆర్ఆర్ రాజు, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

జగ్గిరెడ్డి నాయకత్వంలో పార్టీ పటిష్టతకు కృషి



జగ్గిరెడ్డిని సత్కరించి అభినందిస్తున్న పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు

అమలాపురం టౌన్: జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నాయకత్వంలో జిల్లాలో పార్టీ మరింత పటిష్టమయ్యేలా కృషి చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు అన్నారు. అమలాపురానికి చెందిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి కార్ల కాన్వాయ్‌తో జగ్గిరెడ్డి స్వగ్రామం రావులపాలెం మండలం గోపాలపురానికి ఆదివారం వెళ్లి ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కముజు రమణ, అమలాపురం మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవి, పార్టీ మండల యువజన అధ్యక్షుడు కేతా భాను తేజ, పార్టీ జిల్లా చేతన విభాగం అధ్యక్షుడు జాన గణేష్, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు చెల్లుబోయిన నాని, దాసరి అరుణకుమారి, బొక్కా ఆదినారాయణ, అమలాపురం మున్సిపల్ కౌన్సిలర్లు బండారు గోవింద్, చిత్రపు రామకృష్ణ, గోపీ రాజీ రమేష్, దొంగ చిన్నా తదితరులు పాల్గొని జగ్గిరెడ్డి సత్కరించి అభినందించారు.

విద్యార్థుల్లో అపారమైన ప్రతిభా నైపుణ్యాలు



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో సలీం బాషా

అమలాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఏ రంగంలోనూ తీసిపోరని వారిలో అపారమైన ప్రతిభ నైపుణ్యాలు దాగి ఉన్నాయని వారిలోని సృజనాత్మకతను కళాత్మకతను ఉపాధ్యాయులు గుర్తించి ప్రతిభను ప్రోత్సహించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా అన్నారు. కామనగరువు పితానివారిపాలెం ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. హెచ్ఎం సత్యప్రియ ఉపాధ్యాయిని రోజా రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవాలకు డీఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల జానపద నృత్యాలు, సేవ్ ది ప్లాంట్స్ అనే సందేశాత్మక లఘు నాటిక ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు సత్యప్రియ రోజారాణిని డీఈవో దుశ్శాలువాతో సత్కరించారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని డీఈవో చూసి, అసంపూర్తిగా ఆగి ఉన్న భవనం పూర్తి చేయడానికి అవసరమైన నిధులను మంజూరు చేశారు. సర్పంచ్ నక్కా అరుణకుమారి, ఎంఈవో కృష్ణవేణి, ఎస్ఎంసీ చైర్మన్ నక్కా సుజాత, వార్డు సభ్యులు శ్రీనివాస్, ఎస్టీయూ నాయకులు దొరబాబు, ఎస్ఎస్ పళ్లంరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్యం.. అస్తవ్యస్తం



యానాంలోని ఓ వీధిలో పేరుకుపోయిన చెత్త

- వీధుల్లో దుర్గంధం వ్యాప్తి
- యానాం వాసుల ఆందోళన

యానాం: రెండు నెలల నుంచి పట్టణ పరిధిలో ఏ వీధి చూసినా ఎక్కడ చెత్త అక్కడ కొండలా పేరుకుపోతుండటంతో పలు అంటువ్యాధులు ప్రబలుతున్నాయని తక్షణం డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు యానాం పరిపాలనాధికారి చర్యలు తీసుకోవాలని ఆదివారం స్థానికులు పలువురు విన్నవించారు. కనకాలపేట డంపింగ్‌యార్డును మూసివేయడంతో ప్రభుత్వం యార్డు ఏర్పాటుకు స్థలం చూపించకపోవడంతో నెలల తరబడి సంబంధిత పారిశుధ్య పనులు నిర్వహించే హెచ్ఆర్ స్క్వేర్ సంస్థ, మున్సిపాలిటీ సిబ్బంది వీధుల్లోని చెత్తను తొలగించడం లేదు. దీంతో పాస్టిక్ వ్యర్థాలు, ఇళ్లల్లో చెత్త, షాపుల్లో చెత్త, భోజన హోటళ్లు, రెస్టారెంట్లలో తినేసిన ప్లేట్లు సైతం రోడ్డుపై పడేస్తుండటంతో దుర్గంధం వ్యాపించి దోమలు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోయారు.

పుదుచ్చేరిలో యానాం భాగం కాదనట్టు ఇక్కడ తీవ్ర అపరిశుభ్ర సమస్యపై ప్రభుత్వం వ్యవహరిస్తోందని స్థానికులు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజధాని పుదుచ్చేరికి 850 కిలోమీటర్ల దూరంలో ఉన్న యానాంలో సమస్యలపై స్పందించాలని పలువురు ఎల్జీ కైలాషనాథన్‌కు వినతిపత్రాలు పంపారు. ఈ సమస్యను కొంత మంది తమ రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో చెత్త ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందాలని డంపింగ్‌యార్డుకు స్థలం ఎంపిక ప్రక్రియ ముందుకు వెళ్లడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

అగ్నిమాపక యంత్రాలు, సామగ్రి ప్రదర్శన



అమలాపురంలో అగ్నిమాపక యంత్రాలు, పరికరాలు పనిచేసే విధానాన్ని వివరిస్తున్న అధికారులు, సిబ్బంది

అమలాపురం టౌన్: అమలాపురం అగ్నిమాపక దళం ఆధ్వర్యంలో వారం రోజులుగా కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు పట్టణంలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలను స్థానిక అగ్నిమాపక కేంద్రానికి ఆహ్వానించి వారికి అగ్నిమాపక శకటాలు, యంత్రాలు, సామగ్రిని ప్రదర్శించి అవి పనిచేసే తీరుపై అగ్నిమాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు అవగాహన కల్పించారు. వారం రోజులపాటు వివిధ ప్రాంతాల్లో అగ్నిమాపక సిబ్బంది శకటాలు, యంత్రాలు, సామగ్రితో వెళ్లి ఆయా నివాసితులకు, కార్మికులకు, వైద్య సిబ్బంది సమక్షంలో డెమోలు నిర్వహించి అగ్ని ప్రమాదాల నియంత్రణపై చైతన్యపరిచారు. అగ్ని ప్రమాదాల నివారణకు పలు జాగ్రత్తలు సూచిస్తూ పోస్టర్లను అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు పంపిణీ చేశారు. దళాధికారి మురళీ కొండబాబు, లీడింగ్ ఫైర్ మెన్ మట్టపర్తి బలరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ముమ్మిడివరం: అగ్రిమాపక వారోత్సవాలు ఆదివారం ముగిసాయి. ముమ్మిడివరం అగ్రిమాపక కేంద్రం ఇన్‌చార్జ్ అధికారి కేవీ మురళీ కొండబాబు ఆధ్వర్యంలో సిబ్బంది అగ్రి ప్రమాదాలు జరిగే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వినియోగించే పరికరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది కేఎస్ఎస్ నారాయాణ, ఏఎస్ఎన్‌రాజు, యూవీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖేలో ఇండియాకు విద్యార్థుల ఎంపిక

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఎంపికయ్యారు. ఈనెల 16న భీమవరం హైస్కూల్లో జరిగిన 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ మాల్‌ఖంబ్ రాష్ట్ర స్థాయి సెలక్షన్ ట్రయల్స్‌లో సదరు విద్యార్థులు ఎంపికయ్యారు. వివరాలు వ్యాయామోపాధ్యాయుడు బి.రాధాకృష్ణ, ప్రధాన ఉపాధ్యాయుడు పుట్టా సత్యవెంకట సుబ్బారావు తెలిపారు. 10, 9, 7వ తరగతి విద్యార్థులు కె.టైటేష్, కె.తనూజ్, కె.దేవి పై పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి మే 2 నుంచి బిహార్‌లో జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పోటీలకు అర్హత సాధించినట్టు వారు తెలిపారు. ఎంపికైన వారిని ఎంఈఓ ఎం.విజయశ్రీ, అల్లూరి కృష్ణరాజే, స్థానికులు అభినందనలు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు



రంగాపురంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



అమలాపురం శ్మశానంలో తమ పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

అమలాపురం రూరల్: ఈస్టర్ పండుగను అమలాపురం మండలం రంగాపురంలో ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాస్టర్ మొసలి స్పర్జన్ రాజు మాట్లాడుతూ మరణం అనేది జీవితానికి అంతం కాదని ఏసు తన జీవితం ద్వారా సందేశమిచ్చారని అన్నారు. ఈస్టర్‌ను కొత్త జీవితం, ఆశ, విశ్వాసానికి చిహ్నంగా భావించాలన్నారు. క్రైస్తవులు తమ పూర్వీకుల సమాధులను పూలు, కొవ్వొత్తులతో అలంకరించి ప్రార్థనలు చేశారు.

పూర్వీకుల సమాధుల వద్ద నివాళులు

అమలాపురం టౌన్: అమలాపురంలో పలు చర్చిల్లో ఈస్టర్ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు ఆదివారం నిర్వహించారు. కొందరు క్రైస్తవులు చనిపోయిన తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసి నివాళులర్పించారు. క్రీస్తు పునరుత్థాన దినంగా ఈస్టర్‌ను క్రైస్తవులు జరుపుకుంటారు. తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి వాటిని పరిశుభ్రం చేసి పూలు, పండ్లు, ముగ్గులు, కొవ్వొత్తులతో అలంకరించారు. స్థానిక మున్సిపల్ కాలనీ శివారులో ఉన్న శ్మశాన వాటికలో వైఎస్సార్ సీపీ నాయకులు మెండు రమేష్‌బాబు, మెండు సురేష్‌బాబు కుటుంబీకులు తమ పూర్వీకుల సమాధుల వద్ద ఈస్టర్ ప్రార్థనలు చేశారు. స్థానిక మన్నా సిల్వర్ జూబ్లీ చర్చ్ వద్ద గల మన్నా గ్రౌండ్స్ వద్ద భారీ ఎత్తున ఈస్టర్ సభ నిర్వహించారు. రెవరెండ్ షారోన్ రోజ్ కోమనాపల్లి, రెవరెండ్ ఎర్నెస్ట్ తాతపూడి, రెవ. ఎస్టేర్ జ్యోతి తాతపూడి సభకు హాజరైన దాదాపు 5 వేల మంది క్రైస్తవుల సమక్షంలో ఈస్టర్ ప్రార్థనలు చేశారు. స్థానిక సెయింట్ జాన్స్ చర్చిలో పాస్టర్ రెవ. కేకే పాల్ చర్చ్‌కు వచ్చిన క్రైస్తవులతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు.

యానాంలో..

యానాం: ఏసుక్రీస్తు పునరుత్థాన దినం, మరణంపై సాధించిన విజయానికి గుర్తుగా నిర్వహించుకునే ఈస్టర్‌ను పురస్కరించుకుని ఆదివారం నియోజకవర్గ పరిధిలో పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రధానంగా మెట్టకూరు మదర్ సుశీల మెమోరియల్ బాప్టిస్టు చర్చిలో బిషప్ దొమ్మేటి సామ్యూల్‌సాగర్ ఆధ్వర్యంలో ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. పురాతన ఫ్రెంచికాలం నాటి రోమన్ కేథలిక్ చర్చిలో ఫాదర్ మరియ దాసు ఆధ్వర్యంలో ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. అంతకుముందు తెల్లవారు జాము నుంచే పలు క్రైస్తవ సమాధుల వద్ద ఆయా కుటుంబ సభ్యులు కొవ్వొత్తులు వెలిగించి పూలమాలలతో నివాళులర్పించారు. పట్టణ పరిధిలో పలు చర్చిల్లో ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

శ్రీకాంత్‌కు పార్టీ నాయకుల అభినందన



వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ శ్రీకాంత్‌ను అభినందిస్తున్న నాయకులు

ఉప్పలగుప్తం: అమలాపురం నియోజవర్గ కోఆర్డినేటర్‌గా నియమితులైన డాక్టర్ పినిపే శ్రీకాంత్‌ను మండలంలోని ఎస్.యానాం గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందించి అభినందించారు. రేవు రాజేష్, గేద్దం కిరణ్, ముత్తాబత్తుల సురేష్, జొన్నాడ మహాలక్ష్మీ, మట్టా నాని, అంబటి శ్రీను, దారా చిన్న శ్రీకాంత్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పారిశుధ్య సమస్యపై నేడు అఖిలపక్షం ధర్నా

యానాం: యానాం పట్టణంలో రెండు నెలలుగా పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ప్రజలను రోగాల బారి నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21 సోమవారం స్థానిక ఆర్ఏఓ కార్యాలయం వద్ద వీకేసీ పార్టీ, యానాం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ, పర్యావరణ పరిరక్షణ సమితి, ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆదివారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్థాని దినేష్, పర్యావరణ పరిరక్షణ సమితి కోఆర్డినేటర్ దుగ్గదుర్తి అనితశ్రీ, మెల్లం శ్రీను ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్న ధర్నాలో పట్టణ పరిధిలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. పుదుచ్చేరి ప్రభుత్వం చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని, డంపింగ్ యార్డుకు స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



అమలాపురం డిపో వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

అమలాపురం రూరల్: అమలాపురం డిపోలో డ్రైవర్ బీఎస్ నారాయణ సస్పెన్షన్‌ను రద్దు చేసి రాజోలు డిపోలో పోస్టింగ్ ఇచ్చారని, ఆయనకు అమలాపురం డిపోలో పోస్టింగ్ ఇవ్వాలని ఉద్యోగులు ఎన్ఎంయూ, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 62వ రోజు ఆదివారం గ్యారేజ్ వద్ద ధర్నా నిర్వహించారు. 1/19 సర్క్యులర్‌ను డిపోలో అమలు చేయాలని ఎన్ఎంయూ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి పి.రాంబాబు, డిపో అధ్యక్షుడు ఎండీ ఔలియా కోరారు. నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులను వెంటనే ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, ఈ హెచ్ఎస్ స్థానంలో పాత వైద్యం విధానాన్ని ప్రారంభించాలని, ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం ద్వారా లేదా ఆర్టీసీ సంస్థ ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గణపతి, డీపోకార్యదర్శి మణి రాజు, గ్యారేజ్ కమిటీ కార్యదర్శి గోరీనాథ్ పాల్గొన్నారు.

నిత్యకల్యాణం.. పచ్చతోరణం..



వాడపల్లిలో స్వామి అష్టోత్తర పూజ నిర్వహిస్తున్న పండితులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రం నిత్య కల్యాణం పచ్చతోరణంలా తిరుమల క్షేత్రాన్ని తలపిస్తోంది. ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్య ఫలం నానుడితో అశేష భక్తజనం తరలి రావడంతో కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. శనివారం రాష్ట్ర నలుమూలల నుంచి అశేష సంఖ్యలో భక్తులు తరలివస్తుండగా మిగిలిన ఆరు రోజులు కూడా అత్యధికంగా భక్తజనం తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. వారితో పాటు ఏడు వారాల నోము పూర్తి చేసుకున్న భక్తులు అష్టోత్తర పూజలు జరిపిస్తున్నారు. ఆదివారం స్వామివారి అష్టోత్తర పూజలో ప్రతి రోజు కంటే మించి భక్తులు పాల్గొన్నారు. ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు కూడా అత్యధికంగా తరలివచ్చారు. దాంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ-ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు వసంత మండపంలో స్వామివారికి అష్టోత్తర నామార్చన, నిత్య కల్యాణం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు, అన్నప్రసాదన్ని స్వీకరించారు.